కథ

# ఓదార్పు

**శివలపద్మ**

గేటు దాటి లోపలకి వచ్చి గుమ్మంలోకి అడుగు పెడుతూనే శోకాలు ప్రారంభించింది సావిత్రి.

"ఏమిటే భారతీ! ఈ ఘోరం... దేముడు నిన్నెందుకే ఇంత అన్యాయం చేశాడు? నీకిదేం శిక్షే తల్లీ! నాలాంటిది బ్రతికి ఏం ఉద్ధరించాలని నన్నుంచేసి ఆ మహానుభావుడిని పట్టుకుపోయాడు... నువ్వెల్లా తట్టుకుంటావే తల్లీ! ఈ కష్టాన్ని..."

భారతిని పట్టుకుని గొల్లుమంటుంటే నిర్లిప్తంగా ఆవిడ వంక చూసి చిన్నగా ఆవిడ చేతుల్లోంచి తప్పించుకుంది భారతి.

తనతోపాటు గొల్లుమంటుం దనుకుని ఊహించిన ఆవిడ, భారతి నిర్లిప్తతకి కాస్త షాకయ్యింది.

"ఎంత పెద్ద దెబ్బ తగిలిందే నీకు తల్లీ! ఆఖరికి కళ్లల్లో నీళ్లు కూడా కరువయ్యాయే నీకు..." ఈసారి థీమ్ మార్చి మళ్లీ రాగం అందుకుంది. కనీసం అప్పుడైనా భారతి కళ్లల్లో నీళ్లు కనిపిస్తాయేమో అన్న ఆశ(?)తో.

మౌనంగా లేచి లోపలకి తన గదిలోకి వెళ్లిపోయింది భారతి.

బయట నుంచి తల్లి, మేనత్తల శోకాలు, మరెవరివో చిన్నచిన్న ఓదార్పులు వినిపిస్తున్నాయి.

వారం రోజులనుంచి ఇదే వరస!

భర్త తన ప్రియతముడు.. జీవన సహచరుడు తనని వదిలి వెళ్లిపోయాడు. ఖచ్చితంగా బాధగానే ఉంది. కానీ ఎందుకనో కళ్లల్లో నీళ్లు రావటం లేదు. మనస్సంతా శూన్యంగా, అయోమయంగా ఉంది. జరిగినది అర్థమయీ అవనట్లుగా ఉంది. ముందేం జరగాలో ఊహకి అందడం లేదు.



ఈసారి పెద్దఎత్తున మళ్లీ ఏడుపులు విన్పించడంతో అప్రయత్నంగా తలెత్తి చూసింది.

పినతండ్రి భార్య అప్పుడే వచ్చినట్లుంది. తల్లిని పట్టుకొని భోరున విలపిస్తోంది.

భారతికి ఒక్కక్షణం అర్థంకాలేదు. పోయింది తన భర్తే అయితే తల్లిని పట్టుకుని ఏడవడం ఎందుకో. పైగా వీళ్లందరికీ అంటే సంబంధం లేని ఈ మనుష్యులు అందరికీ అంతేసి దుఃఖం ఎలా తన్నుకొస్తోంది? తన భర్తకీ తన పినతండ్రి పెళ్లానికి ఏం సంబంధం? తన భర్త మరణం ఆవిడని అంతగా కుమిలిపోయేలా చేస్తుందా ఎక్కడైనా?

పోనీ తన పరిస్థితి చూసి దుఃఖం వచ్చిందనే అనుకున్నా ఆవిడతో తనకంత సాన్నిహిత్యం ఏం లేదే?

తన ఆలోచనలు తనకే విచిత్రంగా అన్పించాయి భారతికి.

ఈ పరిస్థితిలో భర్త మరణం క్షోభ పెడుతున్న ఈ తరుణంలో తను మనుష్యులను ఎనలైజ్ చేస్తోందేమిటి?

నిజమే తనకొచ్చింది చాలా పెద్ద కష్టం?

కానీ వీళ్లు తననుంచి ఆశిస్తున్నదేమిటి? వెర్రిగా నేలమీద పడి దొర్లాలనా? పిచ్చిగా గుండెలు బాదుకుని రోదించాలనా? ఎందుకు అందరూ తన మౌనాన్ని విచిత్రంగా చూస్తారు?

నీరసంగా తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకుంది. "వదినా! మీరు లేచి కాస్త కాఫీ అయినా త్రాగండి. చిన్నపిల్ల... దానికి ధైర్యం చెప్పాల్సింది పోయి మీరే ఇలా అయిపోతే ఎలా? లేవండి..."

అవే మాటలు... వారంనించి విన్పిస్తున్న మాటలు...చెక్కిలిమీద మెత్తని చేతి స్పర్శ తగలడంతో కళ్లు తెరిచింది భారతి.

ఎదురుగా ప్రియనేస్తం జాహ్నవి!

ఎడారిలో ఒక్కసారిగా ఒయాసిస్సు కన్పించినట్లయింది భారతికి!

"జానీ! ఎప్పుడొచ్చావే? నేను నీకోసం తపిస్తున్నాననుకో...వీళ్లంతా కలిసి నాకు పిచ్చెక్కేలా చేస్తున్నారు. శోకాల మీద శోకాలు...భరించలేకపో తున్నాను...నువ్వు రాకపోతే నేనేమయ్యేదాన్నో." ఆరాటంగా అంటున్న ఆమెని అర్థం చేసుకున్నట్లుగా చూసి లాలనగా చేయి నొక్కింది జాహ్నవి.

"ఎలా అయింది భారతీ! ఇంత హఠాత్తుగా... ఇదంతా..."

"హుఁ... దాన్నే డైజెస్ట్ చేసుకోలేక నేను అయోమయంలో పడిపోయాను జానీ! ఏమీ కంప్లయింట్ లేదు. ఓ చిన్న హార్ట్‌పెయిన్... ఓ పదినిముషాల బాధ... అంతే... జానీ! నా భర్త చనిపోతే నాకంతకన్నా కష్టం లైఫ్‌లో ఏముంటుందే? మరి వీళ్లంతా... ఎందుకిలా...?"

"ఏమైందే! ఎనీథింగ్ రాంగ్ విత్ దీస్ పీపుల్?"

"ప్చ్... ఏం చెప్పాలి జానీ! ఈ వారం రోజుల నుంచి, నాకో కొత్త ప్రపంచం చూస్తున్నట్లుగా ఉంది. ఏడుపులు శోకాలు దాంతోపాటు కొత్త కొత్త వ్యాఖ్యానాలు...నేనిలా మౌనంగా ఉండకూడదట. గుండెలు బాదుకుని ఏడవాలట...నాకసలు దుఃఖమే లేదట. తన ఇన్స్యూరెన్స్ డబ్బులే ఇప్పుడు నా ఆలోచనల్లో ఉన్నాయట..."

"మైగాడ్! ఏమిటే ఇది?" నివ్వెరపోయింది జాహ్నవి.


"వాళ్లు నా దుఃఖాన్ని నా కన్నీటితో కొలుస్తున్నారు జానీ. కళ్లల్లో నీళ్లు లేవు కనుక మనస్సులో దుఃఖం లేదని నిర్ణయించేశారు. ఫర్వాలేదు. ఆపైన దానిమీద కామెంట్స్!"

"అఫ్‌కోర్స్... మేము పెళ్లి చేసుకున్నప్పుడే మాకు తెలుసు. ఎవరో ఒకరం ముందర చచ్చి పోతామని. నాతో ఎప్పుడూ చెప్పేవాడు. ఏ కారణంగానైనా నేను ముందు చనిపోతే నువ్వు బెంబేలెత్తిపోకూడదు... ధైర్యంగా మన బాధ్యతలని నిర్వర్తించాలి, పిల్లల పట్ల మనకున్న ఆశయాలు నెరవేరాలి అంటే నా పాత్ర కూడా నువ్వే పోషించి నన్ను నీలో కలుపుకుని నువ్వు వాళ్లని పెంచాలి అని. ఆ మాట కొన్ని వందలసార్లు గుర్తుకొచ్చి నన్ను నేను మోటివేట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

"కాని మళ్లీ ఇంతలో ఎవరో వచ్చి నా జీవితంలో నాకెంత పెద్ద కష్టం వచ్చిందో నేను మరిచిపోకుండా మళ్లీ గుర్తుచేస్తారు."

"ఇంతమంది వచ్చి నా కష్టానికి కడుపు తరుక్కుపోయేలా శోకాలు పెట్టి వెళతారే గానీ, నీముందు నీ కర్తవ్యం ఉంది దానికి మా సపోర్ట్ ఉంటుందని ఒక్కరంటే ఒక్కరు చెప్పడం లేదు. పైగా ఈ సమయంలో నా బిహేవియర్ ఇలా ఉండకూడదని నా వెనకే కామెంట్స్! ఇదేం సాంప్రదాయం జానీ! పదిహేనేళ్లు నాతో ఉన్న మనిషి, నా కష్టసుఖాలను పంచుకొన్న మనిషి హఠాత్తుగా నన్నొంటరిదాన్ని చేసి సగం జీవితంలానే నన్నొదిలేసి వెళ్తే నాకు బాధగా ఉండకుండా ఎలా ఉంటుంది? కానీ కన్నీళ్లు రాకపోవడం నా తప్పా?"

వాడిన ముఖం, లోతుకుపోయిన కళ్లతో జాలిగా అడుగుతూంటే మనస్సు చివుక్కుమంది జాహ్నవికి. స్నేహితురాలి తలని ఎదకు చేరువగా తెచ్చుకుని లాలనగా తల నిమిరింది.




నిజమే...భోరున ఓ పావుగంట ఏడ్చేసి, ముఖం కడిగేసుకుంటే దుఃఖం కాస్తయినా ఉపశమించన ట్లుంటుంది. కానీ కన్నీళ్లురాని బాధ నరకయాతన! ఎదురుగా ఒక పెద్ద శూన్యం... మనస్సంతా అయోమయం. మాటలతో చెప ్పలేని బాధ గుండెను ప్రతిక్షణం మెలిపెడుతూ ఉంటే నిజంగా ఆ బాధని కన్నీటి రూపంలో కడిగేస్తే ఎంత బాగుండేది! కానీ అన్ని వేళలా అలా జరుగదు కదా!

ఈ సమయాల్లో ఈ పరామర్శకి వచ్చేవాళ్ల వైఖరి మరీ విచిత్రంగా ఉంటుంది. అవతలవారిని ముందు ఏడిపించి ఆనక ఓదార్చాలనే తాపత్రయం ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. నిజంగా అవతలివారికి దుఃఖాన్ని మరిపించేటటువంటి ఓదార్పుని చాలా తక్కువమంది ఇవ్వగలరు...

"పోయిన మనిషి ఎలాగా పోయారు. ఓదార్పుతో తీరిపోయేది కాదు నా దుఃఖం... నిజానికీ సమయంలో నాకు కావలసింది ఓదార్పు కాదు. కాస్తంత సపోర్ట్, కాస్తంత మనోధైర్యం! అదెవరూ అర్థం చేసుకోరేం? ఎందుకు నేను విరిగిపోవాలని ఆశిస్తారు? ఇంకా జాలిగా, బేలగా ఉండాలని కోరుకుంటారు?"

స్నేహితురాలి తలమీద ఆప్యాయంగా నిమిరింది జాహ్నవి. "మరిచిపో భారతీ! ఈ మనుష్యులింతే... వారిని గురించి ఆలోచించకు. నువ్వీమాత్రమైనా నిబ్బరాన్ని ప్రదర్శిస్తున్నందుకు నిజంగా అభినందిచాలి. ఈ నిబ్బరాన్ని వదిలిపెట్టకు. ఇదే నీకూ నీ పిల్లలకీ శ్రీరామరక్ష! ఇద్దరు కలిసి జీవితం పంచుకున్నాక అందులో ఎవరో ఒకరు ముందుగా వెళ్లిపోవడం అనేది అనివార్యం. కలిసి తీసుకున్న బాధ్యతను రెండోవాళ్లు సక్రమంగా నిర్వర్తించడం అవసరం. ఈ రెండూ ప్రతి ఒక్కరి జీవితంలో ఎదురయ్యేదే ...తనతో గడిపిన జ్ఞాపకాలనే దీపాలుగా చేసుకుని ఒంటరితనం ఫీలవ్వకుండా ముందుకు సాగిపోవాలే తప్ప ఆగిపోకూడదు. ఇంత వరకూ నీ ఎదురుగా ఉన్నవాడు ఇకమీదట నాలో ఉంటాడు అనుకోవాలి. అంతే...మృత్యువుతో అనుబంధాలు ఆగిపోవు భారతీ! అది అనుబంధానికి ఒక పరీక్ష!

కాలం అస్తిత్వాన్ని చెరిపేయగలదేమో కానీ గుండెల్లో వారి జ్ఞాపకాలనీ వారిపట్ల వుండే మమకారాన్ని చెరిపేయలేదు. కాకపోతే ఆ జ్ఞాపకాలూ, ఆ మమకారం ఇక మీదట నీలో శక్తిగా మారి నిన్ను ముందుకు నడిపించాలి. మీ అనుబంధానికి కాలం పెట్టిన ఈ పరీక్షలో నువ్వు నెగ్గుతావు కదూ!"

స్నేహితురాలి మాటలు గుండెల్లో గూడు కట్టిన దుఃఖాన్ని కొద్ది కొద్దిగా తేలిక పరుస్తుంటే... కర్తవ్యం కళ్లముందు నిలచి వెన్ను తడుతుంటే....

భర్త అనురాగం ఎదలో ఆత్మవిశ్వాసంగా మారి ఆశాదీపాన్ని వెలిగిస్తుంటే...కళ్లనిండా నీళ్లతో స్నేహితురాలివైపు చూసి అవును అన్నట్లు తల ఊపింది భారతి.

■